# ఇదా పెళ్ళంటే

"తల్లి దండనా తండ్రి దండనా గలిగి"

"తల్లి దండనా తండ్రి దండనా గలిగి"

"అత్త దండనా మామ దండనా గలిగి"

"అత్త దండనా మామ దండనా గలిగి"

"పురుష దండనా పుత్ర దండనా గలిగి"

"పురుష దండనా పుత్ర దండనా గలిగి"

"నా బతుకు శుభోదయంగా వెళ్ల మారిపోవాలి తల్లీ"

"నా బతుకు శుభో" "నా గొంతు పలకనని మొరాయించింది. ఇంతమంది దండనల తర్వాత నా బతుక్కింక శుభోదయమేంటి"

"ఏవమ్మోయ్ ఇలా వచ్చి ఈ వాయనాలు ముత్తైదువులకిప్పించు" మా అత్తగారు కుర్చీలో కూర్చుని హుకుం జారీ చేసింది.

మా అమ్మ అట్ల పొయ్యి దగ్గర్నుంచి ఉలిక్కిపడి లేచి చెదిరిపోయిన జుట్టు వెంట్రుకల్ని వేళ్లతో సవరించుకుని ముడి వేసుకుంటూ ఉరుకుల పరుగుల మీద వచ్చింది. తెల్లవారుఝామున లేచిందగ్గర్నుంచీ అదే పనిలో ఉంది. వాకిట్లో మంచం మీద తెల్ల దుప్పటీ పరచి, అట్లుపోసి వాయనాలు పేర్చింది.

పేరంటాళ్ళ వాయనాలు నూట యాభై పైనే అట్లు పోసింది. గిన్నెలో పిండి మిగిలింది కాబోలు ఇంకా పోస్తూనే ఉంది. ఎండలో కర్రల పొయ్యి ముందు కూర్చోవడం వల్ల ముఖం నిండా చెమటలు పోసి ఎర్రగా కందిపోయి ఉంది.

ఆ కళ్లలో అంతులేని అలసట. నీళ్లింకి పోయిన బావిలా నవ్వింకిపోయి ఉంది అమ్మ ముఖం. నెల క్రితం నా పెళ్లితో ఇంకిపోయిన నవ్వు ఇంకా మొలకెత్తనేలేదు. అసలింక మొలకెత్తుతుందో లేదో కూడా తెలీదు. నా తర్వాత ఇంకా ఇద్దరు చెల్లెళ్లున్నారు. వాళ్ల పెళ్ళిళ్ళు చేసేసరికి అమ్మ నవ్వంటే ఏంటో

మరచిపోవచ్చు. పెళ్ళంటే నూరేళ్ల పంటని అనుకోలేదు మేమెవ్వరం. పెళ్లంటే పెళ్లికొడుకు వాళ్లకి పదివేల పంట అని తెలిసాక ఆ పదివేలని పోగుచెయ్యడం కోసం ఇంతదరం ఎన్ని పాట్లు పడ్డామో! నిత్యావసర వస్తువుల ధరల్లాగా పెళ్లికొడుకుల ధర పెరిగిపోకూడదని ఎందరు దేవుళ్ళకి మొక్కేమో!

పగలంతా లేత్ మిషన్ పన్లో అలిసిపోయి ఇంటికొచ్చే నాన్న నాలుగు చెంబుల వేణ్ణీళ్ళు ఒంటిమీద పోసుకుని, రెండు ముద్దలు అన్నం తిని హాయిగా కంటినిండా నిద్రపోకుండా ఎన్ని రాత్రులు కుట్టుమిషనుకి అంకితమై పోయారో! అమ్మ మటుకు అమ్మ అప్పడాలూ, ఊరగాయలూ పెడుతూ, ఎవరింట్లో శుభకార్యమంటే వాళ్లింట్లో పని అందుకుంటూ, రాత్రులు నాన్నకి పనిలో సాయం చేస్తూ.....

చెల్లెళ్లు ఊరి బయట గుట్టలోంచి ముగ్గురాళ్లు ఏరి తేవడం, నేనూ వాళ్లూ కలిసి దంచిన ముగ్గును వాళ్లు ఇంటింటికీ వెళ్ళి అమ్ముకు రావడం, సగ్గుబియ్యం ఫేక్టరీ వాళ్లు బస్తాల్తో కుమ్మరించిన కర్రపెండలం దుంపల్ని చెక్కి, ముక్కలు తరిగి వాళ్ల కప్పగిండం ..... అయిదు పైసల్ని పది పైసల్నీ కూడా అపురూపంగా చూసుకుంటూ సరైన తిండి తినకుండా కూడబెట్టాం. అలా మూడేళ్ళుగా కూడబెట్టిన సొమ్ముని అప్పుల వాళ్ల చేతుల్లో పోసినట్టు మగపెళ్ళి వాళ్ల చేతుల్లో పోస్తూంటే అమ్మ నాన్నల మాటేమో గాని ముందు నా ప్రాణం విలవిలల్లాడింది.

నన్ను పదో తరగతితో చదువు చాలించేసి ఇంట్లో కూర్చోమన్నప్పుడే చెప్పేను- "నాన్నా, బస్తీకెళ్లి నేనింకా చదువుకుంటాను. మంచి ఉద్యోగం చేసి మిమ్మల్నందర్నీ పోషిస్తాను" అని, వీళ్లు వింటేనా"హమ్మయ్యో అని గుండెల మీద చెయ్యేసుకుని హడిలి పోయింది అమ్మ. నాన్న మురిపెంగా నవ్వేసి "పిచ్చి పిల్లా" అని తేల్చేసాడు. నిజానికి అప్పుడలా అన్నానే గాని పెళ్లనే సరికి నేనూ ఆనందంగా రెడీ అయిపోయాను. అద్భుతమైన జీవితాన్ని ఊహించుకుంటూ రంగురంగుల కలల్లో తేలిపోయాను.

పెళ్లికి మూడురోజులు ముందు పెళ్లికూతురు ముహూర్తం వచ్చింది. ఆ మూడురోజులూ తక్కువ ఖరీదువే అయినా రోజుకో కొత్తచీర కట్టుకుని తెగ మురిసి

పోయాను. ఆలోచించడానికేం లేనంత ఖాళీగా అయిపోయాను.

....ఖర్చుకి ఝడిసి మావాళ్ళు పెద్దగా ఎవర్నీ పిలవలేదు. మగపెళ్ళివాళ్లు మాత్రం ఓ వంద మందిపైగా తరలొచ్చారు. పక్క బస్తీనేగా, అక్కడ బస్సెక్కి ఇక్కడ దిగారు. మా రెండు గదుల ఇల్లూ, చిన్న వాకిలీ ఆ జనంతో కిక్కిరిసి పోయాయి. చాలా మంది వెళ్ళి రోడ్డుమీద నిలబడ్డారు.

"చెప్పా పెట్టకుండా ఇదేమిటండీ ఇంతమంది" అని లోపలనుకోబోయి పైకి నోరు జారాడు మానాన్న.

"గతిలేకపోతే చెప్పండి, పిల్లని తీసుకెళ్లి మా ఇంట్లో జరిపించుకుంటాం" రయ్యిమంది మా అత్తగారు.

ఏదో అపచారం చేసిన వాడిలా తలదించుకుని, అప్పటికప్పుడు పరుగులు పెట్టి ఏర్పాట్లు చేసాడు నాన్న. మంచితనం, మాట నిలకడా ఉన్నవాడని పేరు తెచ్చుకోబట్టి పచారీ కొట్టు వాళ్లు, బట్టల కొట్టు వాళ్ళు, వర్క్‌షాపు వాళ్ళూ అడిగినంతా అప్పు పెట్టారు.

ఓ పక్కన పెళ్ళి ఘనంగా చెయ్యలేదని సణుగుతూనే ఆ లాంఛనం ఈ లాంఛనం, వాళ్లకి బట్టలు పెట్టాలి వీళ్లకి బట్టలు పెట్టాలి అంటూ బాగానే గుంజింది మా అత్తగారు.

పెళ్ళైన నెలైనా కాకుండానే ఇదో ఈ అట్ల తద్దొకటి వచ్చి పడింది. దీనికయ్యే ఖర్చు తల్చుకుని అమ్మ కళ్లనీళ్లు పెట్టుకుంది. అక్కడికే ఆనవాయితీ లేదని తప్పించుకోజూసేరు మా వాళ్లు. "అదేం కుదరదు, మాకు ఆనవాయితీ ఉంది జరిపించాల్సిందే అంటూ ఘాటుగా ఉత్తరం రాయించింది మా అత్తగారు.

ఈ నోము ఆవిడ కొడుకు ఆయురాభివృద్ధికీ, కోడలి సౌభాగ్యానికి సంబంధించిందట.దాని ఫలితమే ఈ రోజిదంతా.

మా అత్తింటి వాళ్లందరికీ మా నాన్న చేత బట్టలు పెట్టించి, నా నెత్తిన నాల్గు అక్షింతలు చల్లి "మిగతా కార్యక్రమమంతా మీరు చూసుకోండి" అంటూ దక్షిణ

పుచ్చుకుని చక్కాపోయాడు పంతులు గారు. ఓ పీట మీద నన్ను ఒంటి కాలిమీద నిల్చోబెట్టి, చేతులు వెనక్కి పెట్టించి వాటిలో పదకొండేసి అట్లు, అరటి పండ్లు, తాంబూలం, ఒకో రూపాయి మా అమ్మ చేత పెట్టించి ముత్తైదువులకి వాయనాలిప్పించేరు. ఏదో తప్పు చేసినట్టు ఇలా ఒంటికాలి మీద నిల్చోవడం చాలా అవమానంగా వుంది నాకు. ఇదంతా దండన కాక మరేమిటి? వచ్చిన వాళ్లెవరో "వాయనాలకేం తెచ్చారు అబ్బాయి వాళ్లు? అనడిగితే బంగారాలు గట్రా మాకు ఆనవాయితీ లేదు. అదుగో ఆ కట్టుకున్న సిల్కు చీర మేం తెచ్చిందే" అంటూ మూతి ముడుచుకుంది మా అత్తగారు. "ఎదవసంత ఎదవసంతని ఒచ్చినోళ్లు తిన్నగా ఎళ్ళకుండా ఎక్కళ్ళేని పెత్తనాలూను, ఇందుకే ఈ పల్లెటూరి మూకంటే నా కసయ్యం" అని చీదరించుకుంది.

నేను కళ్ళు పైకెత్తి ఆవిడ కూర్చున్న తీరును పరికించాను. మహారాణిలా ఠీవిగా కూర్చుంది. నిజానికి వాళ్లదీ రెండు గదుల అద్దె ఇల్లే. మాలాగా మసలడానికి ఈపాటి వాకిలి కూడా లేని ఇరుకు గదుల మురికి కొంప. ఇద్దరు కొడుకులూ సంపాదిస్తున్నా వాళ్ల పరిస్థితీ మాకన్నా మెరుగ్గా ఏం లేదు. అయినా....

విక్రమార్క సింహాసనంలాగా కన్పించిందా కుర్చీ నాకు. ఆవిడ ముందు మా అమ్మొక పనిమనిషిలాగా.... తప్పు తప్పు... ఈ రోజుల్లో పనివాళ్ళెవరూ ఇంత వంగి పని చెయ్యరు. మా అమ్మ ముఖంలో ఆత్మన్యూనత కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది. దీనికంతటికీ కారణం ఆడపిల్లల్ని కనడమేనా? అసలు నేనింతగా ఆలోచించ గలగడమే నాకు చిత్రంగా తోస్తోంది. ఇదంతా అమూల్య చలవే కాదూ! అమూల్య నా చిన్నప్పటి నేస్తం. తనూ నేనూ ఈ వూరి బళ్లోనే ఎనిమిదో తరగతి వరకూ కలిసి చదువుకున్నాం. అమూల్య పట్టుదల వల్లే సెవెన్త్ పాసయ్యాక నేను మళ్ళీ స్కూలుకెళ్ళగలిగేను. అమూల్య నాన్నగారు మా వూళ్ళో స్కూల్ టీచర్‌గా చాలాకాలం పని చేశారు. మా ఇంటికి అవతలి వీధిలో వాళ్ళిల్లుండేది. మేమిద్దరం కలిసి తిరిగేవాళ్ళం, కలిసి చదువుకునేవాళ్ళం, కలిసి ఆడుకునేవాళ్ళం. తనిప్పుడు బస్తీలో డిగ్రీ చదువుతోంది. ఇప్పుడు వ్రాసుకునే ఉత్తరాల్లో నాకు తెలీని ఎన్నో విషయాలు

వ్రాస్తూ ఉంటుంది.

నేను వ్రాసిన కార్డు తనకి అందిందో లేదో, పెళ్ళికి రాలేదు అమూల్య. మూడోరోజు నన్ను అత్తింటికి పంపే తొందరలో ఉన్నారు మా వాళ్ళు. చలిమిడి, లడ్లు, అరటిగెలలు అంటూ ఏదో హడావుడి చేస్తోంది మా అత్త. మనుషుల్ని పెట్టి చేయించే స్తోమతు లేక మా అమ్మ నాన్న రెక్కలు ముక్కలు చేసుకుంటున్నారు.

పెళ్ళంటే ఇంత చేదు అనుభవంలా ఉంటుందని, అమ్మా నాన్న ఇంతగా నలిగిపోతారనీ ఊహించలేదు నేను. కళ్ళల్లో పొంగుతున్న ప్రవాహాన్ని ఆపలేక ఆపుకుంటున్నాను.

అప్పుడొచ్చింది అమూల్య- ఉత్తరాల్లోని రైటింగ్‌లాగే ఎంతో మారిపోయిన తనని చూసి పెద్దగా ఆశ్చర్యం కలగలేదు నాకు.

వస్తూనే నన్ను వాటేసుకుంది. ఆరిపోయిన ఆనందదీపం మళ్ళీ వెలిగింది నాలో.

అక్కడే కూర్చున్న మా ఆయన్ని పరిచయం చేస్తే'హలో" అని పలకరించింది. మా అత్తగారికి నమస్కారం చేసింది. తిరిగి ఎలా పలకరించాలో తెలీనట్టు ముడుచుకుపోయారు వాళ్ళిద్దరూ.

ాకిట్లో పొయ్యి భగభగల్లో మాడిపోతున్న మా అమ్మానాన్నల్ని పలకరించి "ఏంటంకుల్, ఇంకా ఈ చాదస్తాలు? ఈ బిందెలు బిందెలు స్వీట్స్ ఎవరు మాత్రం ఏం చేసుకుంటారు? ఆ డబ్బుల్తో పార్వతికేదైనా పనికొచ్చే వస్తువు కొనివ్వొచ్చుగా" అంది.

"రావే, అటుపోయి కూర్చుందాం కాస్సేపు" అని నన్ను గదిలోకి లాక్కుపోయింది." ఏవంటున్నాడు నీ హీరో" అంది చిలిపిగా కళ్లు చికిలిస్తూ, "పోవే, నీతో మాట్లాడను నేను"

"ఏం ఏమైందటా,తనతో తప్ప ఇంకెవరితోనూ మాట్లాడొద్దన్నాడా మీవాడు?"

"చీఛో, సిగ్గులేదు నీకసలు పెళ్ళికి రాకుండా, కబుర్లు చెప్తున్నావిపుడు"

"అందుకనే కదా ఇప్పుడొచ్చాను. నిజం చెప్పు, పెళ్ళికి నేనొచ్చుంటే ఆ తొందర్లో ఆ రద్దీలో మనకిలా మాట్లాడుకొనే టైం దొరికేదా?"

"నిజమే సుమా!"

నువ్విలా నాదగ్గర్లాగే అతని దగ్గర కూడా అన్నిట్నీ నిజమే సుమా అని ఒప్పేసుకుంటే నిన్ను అమాయకురాల్ని చేసి పిలకపుచ్చుకుని ఆడించేయగలడేవ్"

"ఫోవే మాటల్నేర్చావ్ బాగా"

"నాకోటి చెప్పవే, అతన్నీకు పూర్తిగా నచ్చే పెళ్ళాడేవా?"

"ఏం?"

"ఏం లేదూ, అతని సంపాదన చాలా తక్కువ కదా, ఎలా ఎడ్జస్ట్ కాగలవ్? నువ్వు చూస్తే చదువు మానేశావ్?"

"అదంతా నేనేం ఆలోచించలేదే. మా అమ్మకీ నాన్నకీ నేను పెళ్ళిచేసుకుని అత్తగారింటికెళ్ళడం కావాలి. మా వాళ్ళిచ్చే కట్నానికి ఇంతకన్నా ఎక్కువ సంపాదించేవాడెలా వస్తాడు చెప్పు"

ఫ్చ్... నువ్వు నేర్చుకోవలసినది చాలా ఉందే. సర్లే, ముందతని చేత ఆ సిగరెట్ మాన్పించు, లేకపోతే అతని జీతం కాస్తా ఆ సిగరెట్లకే చాలదు. ఏ డెంటల్ క్లినిక్కో తీసికెళ్ళి కాస్త ఆ గారపట్టిన పళ్ళని స్కాలింగ్ చేయించుకోమని చెప్పు. లేకపోతే నీ పక్కన వెక్కిరించినట్టుంటాడతను"

దాని ధోరణికి నవ్వొచ్చింది నాకు.

ఈలోగా రెండుసార్లు పిలిచేడతను. మంచి నీళ్లు పట్రా, అగ్గిపెట్టె పట్రా అంటూ.

పెళ్ళై రెండు రోజులు కాలేదు, అప్పుడే నీ మీద అంత అజమాయిషీ చేస్తున్నాడేంటే, అయినా తల్లి ఎదుట కూర్చొని ఆ సిగరెట్ కాల్చడవేంటసలు? విసుక్కుంది అమూల్య. ఇదే విషయాన్ని మా చుట్టు పక్కల ఇళ్ల వాళ్ళు అత్త వరసైన

వాళ్ళు మురిపెంగా మెచ్చుకున్నారు పొద్దుటే. "అప్పుడే మొగుణ్ణి కొంగున కట్టేసుకుంది అంటూ.

అసలు అమూల్య ఆలోచనల్లోనే ఏదో లోపముంది అన్పించింది నాకు.

ప్రతి విషయాన్నీ భూతద్దంలోంచి చూస్తోంది.

నేను చిన్నబుచ్చుకోవడం గమనించి అమూల్య మాటలాపేసింది. సంభాషణని దారి మళ్ళించి జోక్స్‌తో నవ్వించింది. అమూల్య వెళ్ళాక తను తెచ్చిన పేకెట్ విప్పి చూసి విసుక్కుంది మా అత్తగారు "ఏదో పెద్ద బహుమతిలాగా పేకెట్టు పట్టుకొచ్చింది ఈ పుస్తకాలా? ఎందుకు పనికొస్తాయియ్యి, పాత పేపర్లోడుకూడా కొనడు, ఏ స్టీలు పళ్ళెమో తేవచ్చు కదా ఆ పిల్లా...." అని సాగదీసింది.

నేను వాటన్నిటీ కట్టకట్టి చెక్క బీరువా పైన పారేసాను.

"అదేంటి మరీ మగోళ్ళని కూడా చూడకుండా అలా పలకరించేస్తుంది. నీ ఫ్రెండ్ మంచిదేనా?" అన్నాడు బస్సులో మా ఆయన.

అమూల్య గురించి అతనలా మాట్లాడ్డం నచ్చక మిన్నకుండిపోయాను నేను.

మొదటిసారిగా వాళ్ళింట్లో అడుగు పెట్టిన ఆ నాటి రాత్రి ఏకాంతంలో మేమున్నప్పుడు అతన్ని డెంటిస్టు దగ్గర కెళ్ళమని చెప్పేను ఉండబట్టలేక. నేనూహించని విధంగా నా చెంప ఛెళ్ళు మంది.

"మొగోడి దగ్గరెలా మాట్లాడాలో నేర్చుకో లం..." అన్నాడతను పళ్లు పటపటా కొరుకుతూ భయంతో బిత్తర పోయాను నేను. అక్కడున్న రెండు రోజులూ నేనా షాక్ నుంచి కోలుకోనేలేదు.

మా నాన్నొచ్చి మూడోరోజు నన్నింటికి తీసుకు వచ్చేశాడు. తిరిగి మూడో నెలలో పంపిస్తారట. అప్పుడేమేం సారె పంపించాలో ఓ పెద్ద లిస్టిచ్చింది. మా అత్తగారు. దాన్లో రాసున్న ఫర్నిచర్‌కే కొన్ని వేల రూపాయలు కావాలి.

మళ్ళీ ఆ ఇంటి కెళ్ళడమంటే నాకు భయం పట్టుకుంది. ఇంటికి రాగానే మా

అమ్మతో చెప్పేను కొట్టిన విషయం. ఆ మాట తల్చుకుంటేనే నాకు దుఃఖం పొంగుకొచ్చింది.

"పోన్లే, ఊరుకో, కట్టుకున్న వాడే కదా కొట్టేడు, పరాయివాడేం కాదు కదా, నలుగురికీ తెలిస్తే మనకే నగుబాటు. అసలిలా అత్తింటి విషయాలు పుట్టింటికి చేరెయ్యకూడదు తెలుసా! మగవాళ్ళంతే మరి" అంది అమ్మ.

నాకు ఉక్రోషం ముంచుకొచ్చింది. "అయితే నాన్న నిన్నెప్పుడూ కొట్టడేం?"

"అది వాళ్ళ వాళ్ళ ఇష్టం మీద ఆధారపడి వుంటుంది."

"అంతేనా అమ్మా, అంతా వాళ్ళిష్టమేనా అన్నిటికీ? మన యిష్టాలేం ఉండవా?"

"ఉండవు, అంతగా ధైర్యం కావాలంటే గజేంద్ర మోక్షం తీసి చదువుకో"

హు.... పెళ్ళికి ముందు రుక్మిణీ కళ్యాణం, పెళ్ళయ్యాక గజేంద్రమోక్షం, అవి నాకు సహనాన్ని నేర్పిస్తాయేమో గాని వాళ్ళని మార్చవుగా...

* * *

వారానికి రెండు మూడు సార్లు రాత్రిళ్ళు అతనొచ్చి వెళ్తున్నాడు. అసలే వర్షాకాలం. ఆ ముందున్న చిన్న వరండాలో అమ్మ నాన్న చెల్లాయిలూ ఇరుక్కుని పడుకోవడం, మేమిలా పడకగదిని ఆక్రమించుకోవడం, ఇదంతా నాకు చాలా అనీజీగా అన్పిస్తోంది. తెల్లవారిలేచి వాళ్ళ ముఖాలు చూడాలంటే సిగ్గు.

పెళ్ళి చేసుకోకుండా తనకి నచ్చిన వాడెవరితోనో ఇలాంటి పని చేస్తోందనే కదా వీధి చివరి పాపను చులకనగా చూస్తున్నారు.

పదివేలు ఎదురిచ్చి మీరే నా చేత...

నా ఆలోచన్లెందుకో సవ్యంగా సాగడం లేదేమోనని అనుమానం వచ్చింది. భయం కూడా వేసింది.

ఓ రోజు రాత్రి వచ్చేటపుడు అతను నాకోసం ఓ మూరెడు చామంతి పూలమాల తెచ్చాడు. కాస్త బెల్లం మిఠాయి, ఓ పకోడి పొట్లాం తెచ్చాడు. ఆ కాస్తకే మా అమ్మ

సంబరపడిపోయి"చూసావా మీ ఆయనకి నువ్వంటే ఎంతిష్టమో" అంది. నేనూ కాస్త అనుమానిస్తూనే ఆనందించాను. పడుకునే ముందు పొట్లం విప్పి పూలదండను నా జెడలో తురిమాడు. పూలబరువుకి నా మెడ వెనక్కి గుంజేస్తున్నా ఓపికగా పెదవుల మీద నవ్వును అలంకరించుకున్నాను.

"చూడు పార్వతీ సినిమాల్లోలాగా నాచుబుకాన్ని వేలితో పైకెత్తి, నా కళ్ళలోకి ప్రేమగా చూస్తూ అన్నాడు"బస్తీ నుంచి రోజూ బస్సెక్కి రావాలంటే ఎంత కష్టంగా ఉందో తెల్సా. కొన్నాళ్ళలో నువ్వు అక్కడికి వచ్చేస్తావు కదా. అప్పుడు ఇక్కడికి వచ్చి మీ వాళ్ళని చూసి వెళ్తూండవచ్చు. సెకెండుహాండులో లూనా బండొకటి అమ్మకానికొచ్చింది. మీనాన్నని కొనిమ్మని అడుగు. కొత్తదైతే మరీ మంచిదనుకో" తన జోక్‌కి తనే నవ్వేసుకున్నాడు.

నా గుండెల్లో రాయి పడింది. మా నాన్న పరిస్థితి నాకు తెలీకపోతే కదా!

"పాపం మా నాన్న ఇప్పట్లో ఏమీ కొనలేడండీ" అన్నానో లేదో అతనికి కోపం ముంచుకొచ్చింది.

"ఇంకా ఇద్దరు ఆడముండలున్నారుగా ఆళ్ళ పెళ్ళిళ్ళు చెయ్యడా? ఇప్పుడివ్వకపోతే ఇంకా తర్వాత అసలివ్వలేడు నీబాబు"

"కొంచెం మావాళ్ళ పరిస్థితి కూడా అర్థం చేసుకోండి"

"ఏంటే అర్థం చేసుకునేది బోడి, నీలాంటి తెలివి తక్కువ ముండని పెళ్ళాడ్డమే నేన్చేసిన మొదటి పొరబాటు. పెళ్ళయ్యాక ఇంకా నా బాబు, నా వాళ్ళు అనేడుస్తావేమే, ఇక మీద నీ ఇల్లు ఇది కాదు, అది. అందుకే ఎంత వీలైతే అంతా పిండుకుపోవాలి."

"..............."

"ఏం, మాట్లాడవ్"

"నేనడగలేనండి"

నా జెడలో పూలదండని ఒక్క గుంజు గుంజాడతను. మోకాల్తో పొట్టలో ఓ

పోటు పొడిచాడు. బాధతో మెలికలు తిరుగుతున్న నన్నలాగే వదిలేసి అటు తిరిగి పడుకున్నాడు.

*    *    *

ఉన్నట్టుండి ఓ రోజు ఉదయం పదకొండు గంటల వేళ మూడో పోర్షన్‌లో ప్రసూనక్క ఒక్క పొలికేక పెట్టింది. 'అమ్మా' అంటూ, నలుగురం పరుగెత్తుకెళ్ళి చూసేసరికి పొట్ట పట్టుకుని బాధతో మెలికలు తిరిగిపోతోంది. మగాళ్ళెవరూ ఇళ్ళల్లో లేరు.

"నర్సుని పిలవండ్రా" అన్నారెవరో. గబగబా మంచం వాలుస్తూనే పరుగెత్తుకెళ్ళి హెల్త్ సెంటర్ నుంచి మిడ్ వైఫ్ ని పిలుచుకొచ్చాను. ఆవిడడిగిన వేడినీళ్ళు, మెత్తని గుడ్డలు వగైరాలన్నీ అందిస్తూన్నాను. ప్రసూన పడుతున్న బాధ వీళ్ళందరికీ తమాషాలా ఉంది. నవ్వులూ, ఎకసక్కేలూ....

వరండా గ్రిల్స్‌లోంచి అన్ని ఇళ్ళ వాళ్ళూ చూస్తూ ఉండగానే ప్రసూనక్క పాపాయికి జన్మనిచ్చి సొమ్మసిల్లిపోయింది. నర్సుకి బ్లేడు అందించి జనాన్ని తోసుకుని బైటికొచ్చాను.

మిట్టమధ్యాహ్నం ఎండలో సిమెంటు కాల్వలో ప్రసూనక్క పొట్టలోని రక్తం ధారగా ప్రవహించి పోతోంది, నీచు వాసన.

నా కళ్ళ ముందు సూర్య కిరణాలు గిర్రున తిరిగినట్లైంది. భళ్ళున వాంతి చేసుకుని కళ్ళు తిరిగి దబ్బున పడ్డాను.

ఆ సంఘటన తర్వాత నాకు సృష్టి కార్యం మీదే రోత పుట్టినట్టయింది. ఆ సాయంకాలం చెక్క బీరువా మీద నుంచి ఏదో తీస్తుంటే అమూల్య ఇచ్చిన పుస్తకాలు నా చేతికి తగిలాయి.

ఒక పుస్తకం తెచ్చుకుని వెనక మెట్ల మీద కూర్చుని చదవడం మొదలుపెట్టాను.

అలా ఒకటి తర్వాత ఒకటి .... ఆ పుస్తకాలన్నీ చదవడానికి నాకు పదిరోజులు

పట్టింది. అమూల్య నాకు అమూల్యమైన గిఫ్ట్ ఇచ్చిందని నాకు అర్థమైంది.

ఈ ప్రపంచంలో స్త్రీల సమస్యలకి అద్దం పట్టిన పుస్తకాలవి, చదవడం పూర్తయ్యే సరికి నేనెరగని కొత్తలోకం ఒకటి నా కళ్ళ ముందు తలుపులు తెరుచుకుంది. నాలుగు గోడల మధ్య ఉన్నదే నా ప్రపంచం కాదనీ, అది చాలా విశాలమైందనీ నాకర్థమైంది. నేనికపై ఎలా ఆలోచించాలి, ఎలా నిర్ణయాలు తీసుకోవాలి, ఎలా నడుచుకోవాలి అన్నీ ఆ పుస్తకాలే నాకు నూరిపోసాయి. నాకిప్పుడు బ్రతుకు భయం లేదు. నన్నెప్పటికీ ఎవరూ దండించలేరు. నా సమస్యల్ని నేనే ఎదుర్కోగలను, పరిష్కరించుకోగలను.

వచ్చే వారమే నేను అత్తగారింటికి వెళ్ళబోతున్నాను. ఎవరైనా చెంపమీద కొడితే ఆ చెంపను తడుముకొని కన్నీరుమున్నీరయ్యే పిరికి పార్వతిలా మాత్రం కాదు.

అందుకే - ఆ రోజు రాత్రి నాన్న చొక్కా తీసి కొంకికి తగిలించినప్పుడు ఆయన జేబులో పదిలంగా పెట్టుకుని తిరుగుతున్న మా అత్తగారిచ్చిన లిస్ట్ తీసి చించేసి గాల్లోకి ఎగరేసాను. నా ఆలోచన్లు సవ్యంగానే సాగుతున్నాయి అని నాకు నమ్మకం కుదిరింది. పీడింపబడే వాళ్ళ నిర్ణయాలు ఎప్పుడూ సవ్య మార్గంలోనే ఉంటై.

*********

**ఆహ్వానం (ఆగస్టు 96)**